# సాక్షి పెద్దపల్లి

బుధవారం, 29, నవంబర్, 2023






**ఓటేసిన అధికారులు**

జ్యోతినగర్/మంథని: ఎన్టీపీసీ, మంథనిలో సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై జీవన్, రెవెన్యూ డివిజనల్ అధికారి రవీందర్ మంగళవారం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు.



**వైభవంగా దీపారాధన**

రామగుండం: కార్తీకమాసం సందర్భంగా అంతర్గాం మండలం ముర్మూర్ శ్రీపాతాళేశ్వరాలయంలో మంగళవారం రాత్రి దీపారాధన వైభవంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
32.0/27.0

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. చలిగాలులు వీచే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నిబంధనల మేరకు విధులు



మాట్లాడుతున్న డీసీపీ చేతన

గోదావరిఖని: ఎన్నికల నిబంధనలకు లోబడి పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని పెద్దపల్లి డీసీపీ చేతన సూచించారు. మంగళవారం స్థానిక రాజ్యలక్ష్మి గార్డెన్‌లో పోలింగ్ బందోబస్తు పోలీసులతో నిబంధనలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డీసీపీ మాట్లాడుతూ ఓటర్లు, రిటర్నింగ్ అధికారి, పోలింగ్ ఏజెంట్లు తప్ప ఇతరులను లోనికి అనుమతించరాదన్నారు. వాహనాలను 200మీటర్ల దూరంలోనే ఉంచాలన్నారు. ఇతర పోలీసు అధికారులు, ఎన్నికల అధికారులు వస్తే అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. వంద మీటర్ల లోపు కండువాలు, ప్రచారం లేకుండా చూసుకోవాలన్నారు. గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎన్టీపీసీ సీఐ చంద్రశేఖర్, మంథని సీఐ సతీశ్ పాల్గొన్నారు.

### ఓటరు కార్డులేకున్నా ఓటేయొచ్చు

పెద్దపల్లిరూరల్: ఓటరు జాబితాలో పేరు ఉండి, ఓటరు కార్డు లేకున్నా.. ప్రభుత్వం జారీచేసిన 12రకాల ఫొటోతో కూడిన కార్డుల్లో ఏదో ఒకదానిని చూపించి ఓటు వేయొచ్చని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీసు జారీచేసిన పాసుబుక్కు, కార్మిక శాఖ జారీచేసిన ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ ద్వారా ఆర్‌బీఐ జారీచేసిన స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్ట్, పింఛన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ఉద్యోగుల ఐడీ కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఐడీ కార్డులు, ప్రత్యేక వైకల్యం గల ఐడీకార్డులను చూపి ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

### టేబుల్ ఇన్‌చార్జిలకు శిక్షణ

గోదావరిఖని: ఎన్నికల టేబుల్ ఇన్‌చార్జిలకు మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్ల సంఖ్యను ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ, సాంకేతిక లోపాలు, అసాంఘిక కార్యక్రమాలు, ఇబ్బందులను తలెత్తితే తక్షణమే సెక్టార్ అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఈసీఐఎల్ ఇంజినీర్లు, మాస్టర్ ట్రైనర్ల సమక్షంలో సెక్టార్ అధికారులకు ఈవీఎం పరికరాలు, సీయూ, బీయూ, వీవీపాట్‌లను పంపిణీ కేంద్రాలకు తీసుకువెళ్లే సమయంలో అడ్రస్ టాగ్, వరుస సంఖ్య పొల్చుకొని తీసుకువెళ్లాలన్నారు. వెబ్ కాస్టింగ్, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్, ఒక హెల్పర్, ర్యాంప్ తదితర మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, ఈవీఎం పరికరాల నోడల్ అధికారి రామ్మోహన్‌రావు, ఏఆర్వో కుమారస్వామి, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

### అలర్ట్.. అడ్మిన్!

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపించటంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ప్రచార సరళి మారడం, సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులు సైతం విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. అభ్యర్థులు ఇచ్చే హామీలు, ప్రత్యర్థులపై చేసే విమర్శలు, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోల హడావుడి ఉంటుంది. వీటిని ఎవరూ సీరియస్‌గా తీసుకోనంత వరకు ఇబ్బంది లేదు. కానీ ఎన్నికల సమయంలో ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. దీంతో పాటు ఎన్నికల సంఘం, పోలీసు అధికారులు సైతం సామాజిక మాధ్యమాల్లో సందేశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు.

**అడ్మిన్ బాధ్యతలు**

సామాజిక మాధ్యమాల్లో వచ్చే సందేశాలకు వాట్సప్ గ్రూప్‌ల అడ్మిన్లదే బాధ్యత. గ్రూప్‌లో ఉండే ప్రతి సభ్యుడు ఖచ్చితంగా అడ్మిన్‌కు తెలిసి ఉండే విధంగా చూసుకోవాలి. ఎవరైనా అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలి. అడ్మిన్, గ్రూప్ సభ్యులు వివాదాస్పద పోస్టులు చేస్తే ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేసే అవకాశముంది

**చట్టాలు ఏం చెబుతున్నాయంటే**

అశ్లీల సమాచారం, మార్ఫింగ్, తప్పుడు సమాచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా సమాచారం పోస్టు చేస్తే సెక్షన్ 67 కింద మొదటి సారి నేరం చేస్తే అయిదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా, రెండోసారి అంతకన్నా ఎక్కువసార్లు ఇలాంటి నేరాలకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

**ఇవి షేర్ చేయొద్దు**

విద్వేషాలు రెచ్చగొట్టే, తప్పుడు, తెలియని అంశాలు, మధ్య వివాదాలు సృష్టించే సందేశాలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, వీడియోలు, తప్పుదారి పట్టించే సమాచారం షేర్‌చేయొద్దు.

# ష్..గప్‌చుప్!

## ప్రచారం పరిసమాప్తం




- సైలెన్స్ పీరియడ్ మొదలు
- ప్రధాని, సీఎం, రాహుల్ ప్రముఖుల సభలు
- పాతజిల్లాల్లో 50 రోజుల ఎన్నికల ప్రచారం
- సభలు, రోడ్ షోలు, ర్యాలీలతో బలప్రదర్శన
- ఎత్తుకు పైఎత్తులతో హోరెత్తించిన అభ్యర్థులు



నగరంలో మూసివేసిన బార్ అండ్ రెస్టారెంట్

సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి: ఎన్నికల పర్వంలో మరో ఘట్టం మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో సీఎం కేసీఆర్‌తో మొదలైన సభల సందడి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్‌తో ముగిసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే రాజకీయ చైతన్యానికి ప్రతీక. అందుకే, ఈ జిల్లాలో మెజారిటీ సీట్లు సాధించిన వారే రాజధానిలో అధికారంలో ఉంటారన్న నమ్మకం అనాదిగా వస్తోంది. అందుకే, ఈ జిల్లాపై బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రత్యేక దృష్టి సారించి, సర్వశక్తులు ఒడ్డి ప్రచారం చేశాయి.

**ప్రముఖుల సభలతో ఊపు..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా అంటే కేసీఆర్‌కు ఉద్యమ కాలం నుంచి ప్రత్యేక అభిమానం. అందుకే, ఆయన ఈ జిల్లాలో పలుమార్లు సుడిగాలి పర్యటన చేశారు. హుస్నాబాద్‌తో మొదలు పెట్టిన సీఎం కేసీఆర్ తరువాత విడతల వారీగా అన్ని నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆఖరుగా వేములవాడతో ఉమ్మడి జిల్లా సభలు ముగించారు. అలాగే కేటీఆర్ కూడా 13 నియోజకవర్గాల్లో పర్యటించారు.

- ప్రధాని మోదీ కరీంనగర్‌కు, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా (జమ్మికుంట), యూపీ సీఎం యోగి (వేములవాడ), మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే (ధర్మపురి)లు బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంథని, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, వేములవాడలో పర్యటించారు. వీరే కాక రేవంత్‌రెడ్డి, జైరాంరమేశ్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాగేల్ తదితరులు సభల్లో పాల్గొన్నారు.

**50 రోజులు హోరెత్తిన ప్రచారం..**

గతనెల 9న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దరిమిలా.. ఎన్నికల సందడి మొదలైంది. అభ్యర్థుల ఖరారు, నామినేషన్లతో జోరందుకున్న ప్రచారంలో మొత్తంగా దాదాపు 50 రోజులుగా అభ్యర్థులు ఒక్కొక్కరు ఒక్కో స్టైల్‌లో దూసుకెళ్లారు. కొందరు అభ్యర్థులు భారీ బహిరంగ సభల ద్వారా బలప్రదర్శన చేయగా, మరికొందరు నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నమ్ముకున్నారు. ప్రజలకు తమ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలతో పాటు, తమదైన హామీలతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవటానికి యత్నించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో పాటు, వారి కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొన్నారు.

**సైలెన్స్ పీరియడ్ మొదలు..**

ఉమ్మడి జిల్లాల్లో 13 నియోజకవర్గాల్లో ప్రచారం ముగిసింది. మైకులు మూగబోయాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సెలెన్స్ పీరియడ్‌గా ప్రకటించారు. అభ్యంతరకర, రాజకీయపరమైన, బల్క్ ఎస్‌ఎంఎస్‌ల ప్రసారంపై నిషేధం ఉందని అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రచారం తర్వాత తెర వెనుక పంపిణీలపై ఎన్నికల అధికారులు దృష్టి పెట్టారు. బల్క్ మెసేజ్‌లు, సోషల్ మీడియాలపైనా నిఘా పెట్టారు.

**నియోజకవర్గం.. పోలింగ్ స్టేషన్ల వివరాలు..**

కరీంనగర్ నియోజకవర్గంలో 390 పోలింగ్ స్టేషన్లు, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

**నియోజక వర్గాలవారీగా ఓటర్ల వివరాలు..**

| నియోజక వర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | సర్వీస్ ఓటర్లు | బరిలో అభ్యర్థులు |
|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 1,77,893 | 1,77,117 | 44 | 102 | 27 |
| చొప్పదండి | 1,13,050 | 1,19,933 | 07 | 193 | 14 |
| మానకొండూరు | 1,08,846 | 1,12,766 | 01 | 128 | 10 |
| హుజూరాబాద్ | 1,21,809 | 1,27,743 | 06 | 164 | 22 |
| జగిత్యాల | 1,11,720 | 1,19,728 | 20 | 45 | 15 |
| కోరుట్ల | 1,15,027 | 1,25,824 | 04 | 46 | 15 |
| ధర్మపురి | 1,11,172 | 1,15,702 | 06 | 133 | 15 |
| సిరిసిల్ల | 1,19,663 | 1,24,756 | 07 | 106 | 21 |
| వేములవాడ | 1,06,890 | 1,15,331 | 30 | 53 | 16 |
| పెద్దపల్లి | 1,26,046 | 1,28,212 | 08 | 264 | 17 |
| రామగుండం | 1,11,200 | 1,09,794 | 25 | 213 | 23 |
| మంథని | 1,16,707 | 1,19,716 | 19 | 155 | 21 |

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ స్థానాలకు ఈనెల 30న జరిగే పోలింగ్ ప్రక్రియ మూడోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా, శ్రీధరన్, రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బందికి మూడోదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో 837 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్‌కేంద్రాల వద్ద సిబ్బంది 29న రాత్రి బస చేసేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. పోలింగ్ సమయాల్లో పుకార్లు వ్యాపించే అవకాశం ఉందని, ప్రతీ రిటర్నింగ్ అధికారి ఇద్దరు సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి ఫేక్ ప్రచారాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, రిటర్నింగు అధికారులు మధుమోహన్, హనుమా నాయక్, ఏవో శ్రీనివాస్, ఈడీఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

**ఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్**

పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఎన్నికల సంఘం డెప్యూటీ కమిషనర్ నితీశ్ వ్యాస్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్, డీసీపీ చేతన పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధమని మరవొద్దు

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా



2కే రన్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్‌సింగ్ రాణా

కోల్‌సిటీ(రామగుండం): 'ఓటుహక్కు వజ్రాయుధంలాంటిది.. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోండి.. పోలింగ్ శాతం పెంచండి' అని రామగుండం నియోజవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా కోరారు. ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. రామగుండం ఎన్నిక రిటర్నింగ్ అధికారి అరుణశ్రీతో కలిసి జెండా ఊపి రన్ ప్రారంభించారు. ప్రలోభాలకు లోనవకుండా ప్రతీఒక్కరు ఈనెల 30న తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజేశ్ సింగ్‌రాణా కోరారు. రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నా యి. కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, తహసీల్దార్ కుమారస్వామి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రావుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఓటర్లపైనే భారం

- వారిని ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు
- విందులు, నగదు ఇస్తున్న అభ్యర్థులు

**మహిళా ఓటర్లు ఇలా..**

| నియోజకవర్గం | మహిళా ఓటర్లు |
|---|---|
| పెద్దపల్లి | 1,28,212 |
| మంథని | 1,19,716 |
| రామగుండం | 1,09,794 |



పెద్దపల్లిరూరల్: పోలింగ్ గడువు సమీపిస్తోంది. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. అయితే, మహిళా ఓటర్ల మదిలో ఏముందోనని, వారిని ప్రసన్నం ఎలా చేసుకోవాలనే దానిపై అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 7,11,727 మంది ఉంటే(థర్డ్ జెండర్లు మినహా).. అందులో 3,54,005 మంది పురుషులు ఉన్నారు. 3,57,722 మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే మొత్తంగా జిల్లాలో 3,717 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉన్నట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది.

**ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు**

మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పాట్లు పడుతున్నారు. మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీల మద్దతు కూడగట్టి తమకే ఓట్లు పడేలా చూడాలని వేడుకుంటున్నారు. ఎవరికి వారే తమవంతు ప్రయత్నాలు చేస్తుండగా మహిళా నాయకులు సైతం ఎవరు వచ్చి అడిగితే వారికే సహకరిస్తామంటున్నారు. అయితే, వారి మద్దతు ఎవరికి ఉంటుందోనని అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

**తాయిలాలతో..**

ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విందులు, ఇతర తాయిలాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. ఇప్పటికే ఓ పార్టీ నేతలు మహిళా నాయకులకు విందు భోజనం ఏర్పాటు చేసి తలా కొంత ముట్టజెప్పి తమ పార్టీ గుర్తుకే ఓటేసేలా చూడాలని అభ్యర్థించినట్లు ప్రచారం సాగుతోంది. మరోజాతీయ పార్టీ అభ్యర్థి గత ఏడాదిన్నరగా గ్రామాల్లో తిరుగుతూ కులాలు, సంఘాల వారీగా మహిళలు చేసే పనులను బట్టి ఉన్నసంఘాలతోనూ సమావేశాలు నిర్వహించారని సమాచారం. అంతేకాకుండా తమ ప్రచారంలో మహిళలనే వినియోగించడంతో పాటు, బహిరంగ సభలకు రప్పించడంపై దృష్టి సారించారు. ఇపుడు కూడా ఆ ఓటర్లకే నేరుగా నగదు బదలాయిస్తే వారి మద్దతు తమకే ఉంటుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**తొలిఓటు వేయబోతున్న**



ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి నేను ఓటు హక్కు వినియోగించుకోబోతున్న. అందరూ ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి.

– రజిత, రంగాపూర్

**అందరం ఓటేద్దాం**



ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న ప్రతీఓటరు తప్పనిసరిగా హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ శాతం పెంచాలి.

– మంజుల

## పోలింగ్ కేంద్రాలు సిద్ధం

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సిబ్బంది, పోలీసు బందోబస్తు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 2,21లక్షల మంది ఓటర్లుండగా, 259 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం 9గంటలకల్లా పోలింగ్ సిబ్బంది ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకోనున్నారు. ఈవీఎంల కేటాయింపు, సిబ్బంది కేటాయింపు, బందోబస్తు తదితర ఏర్పాట్లు పూర్తయ్యాక భోజనంచేసి తమకు కేటాయించిన గ్రామాల్లోకి ఎన్నికల సిబ్బంది వాహనాల ద్వారా తరలి వెళ్లేందుకు సిద్ధం చేస్తున్నారు.

**సిబ్బందికి 27 రకాల సామగ్రి**



బందోబస్తు పరిశీలిస్తున్న రాజేశ్‌సింగ్ రాణా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సామగ్రి సిద్ధమైంది. రామగుండం నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులకు 27 రకాల వస్తువులను నింపిన బ్యాగులు సిద్ధం చేస్తున్నారు. ఓటర్లకు ఇచ్చేందుకు మార్గదర్శిని పత్రాలను కూడా అన్ని ప్రాంతాలకు అందించే కార్యక్రమం ప్రారంభించారు.

## 30న బస్‌పాస్ కౌంటర్ బంద్

గోదావరిఖనిటౌన్: పోలింగ్ దృష్ట్యా ఈనెల 30వ తేదీన గోదావరిఖని బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ మూసివేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం మంగళవారం తెలిపారు. తిరిగి డిసెంబర్ 1వ తేదీన తెరవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు.

## రేపు ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు సెలవు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న సెలవు ప్రకటిస్తూ ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కర్మాగారంలో పనిచేసే సుమారు 750 మంది కాంట్రాక్ట్ కార్మికులు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.

# ముందుకు వెళ్లక.. వెనక్కి రాలేక..

- ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్న వాహనదారులు
- రామగుండం నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం
- వ్యాపార కూడళ్లలో నిత్యం వేధిస్తున్న రద్దీ
- అమలుకు నోచుకోని 2001 నాటి మాస్టర్ ప్లాన్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార, వాణిజ్య కేంద్రాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధానంగా రహదారుల విస్తరణ అస్తవ్యస్తంగా తయారైంది. 2001 నాటి మాస్టర్ ప్లాన్ నేటికీ అమలు చేయడంలేదు. ఫలితంగా ప్రధాన వ్యాపార, వాణిజ్య కేంద్రంలోని లక్ష్మీనగర్, శివాజీనగర్, మేదరబస్తీ, కల్యాణ్‌నగర్, డాక్టర్స్ స్ట్రీట్, స్వతంత్రచౌక్, అశోక్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాల, ఎలక్ట్రికల్ బజార్, బోళ్ల బజార్, గోల్డ్‌స్మిత్ బజార్ తదితర రోడ్లు ఇరుకుగా ఉండి ప్రజల్ని ముప్పుతిప్పలు పెడుతున్నాయి.

**మాస్టర్ ప్లాన్ అమలుపై అశ్రద్ధ..**

- పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రహదారుల విస్తరణ చేపట్టడం లేదు.
- 2001లో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటికీ అమలు చేయడం లేదు.
- దీని ఆధారంగా గత పాలకవర్గం 2017లోనే పలు రహదారుల విస్తరణకు తీర్మానించింది.



రోడ్డుపై వ్యాపారుల విక్రయాలు

- మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వ్యాపార కూడళ్లలోని రహదారుల విస్తరణకు మార్కింగ్ కూడా చేశారు.
- రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆక్రమణల తొలగింపునకు వారు వెనకడుగు వేస్తున్నారు.
- కౌన్సిల్ ఆమోదం తెలిపి ఐదేళ్లు పూర్తయినా.. ఒక్క పనీ మొదలు కాలేదు.

**అసలే ఇరుకు.. ఆపై రోడ్లపైనే వ్యాపారాలు..**

లక్ష్మీనగర్, మేదరిబస్తీ రోడ్డు, కల్యాణ్‌నగర్, డాక్టర్స్ స్ట్రీట్స్, ఓల్డ్ అశోక థియేటర్, స్వతంత్రచౌక్ రహదారులు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. అసలే ఇరుకు రోడ్లు, దీనికితోడు రోడ్లపైనే వ్యాపారాలు సాగుతున్నాయి. కల్యాణ్‌నగర్, మేదిరిబస్తీ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను నిలిపి లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్నారు. ఏ రోడ్డుపై చూసినా ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేసిన దృశ్యాలే దర్శనమిస్తున్నాయి.



ఇరుకు రోడ్డుపై వాహనాల పార్కింగ్

**తప్పని తిప్పలు**

- డాక్టర్స్ స్ట్రీట్‌లోని ఆస్పత్రులకు పేషెంట్లను తీసుకెళ్లేందుకు ఇరుకు రోడ్లు, తరచూ ట్రాఫిక్ స్తంభించి బంధువులు, అంబులెన్స్ సిబ్బంది నానాతంటాలు పడుతున్నారు.
- షాపింగ్, ఆస్పత్రులు, హోటళ్లకు వస్తున్న ప్రజలు తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.
- కొందరు రోడ్డుపై నిలిపి షాపింగ్ చేస్తుండడంతో సమస్యలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- ఆస్పత్రులు, హోటళ్ల నిర్వాహకులు కస్టమర్ల కోసం పార్కింగ్ స్థలాలను కేటాయించడం లేదు.
- ప్రజావసరాల కోసం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు వస్తువులను ప్రదర్శనలకు పెడుతున్నారు.
- లక్ష్మీనగర్‌లో బల్దియా పాలకవర్గం, అధికారులు పార్కింగ్ స్థలాల ఊసే ఎత్తడం లేదు.

**చర్యలు చేపట్టాలి**



ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి. అనువైన పార్కింగ్ స్థలాలు కేటాయించాలి. షాపింగ్ కోసం లక్ష్మీనగర్‌కు బైక్‌పై వెళ్లాలంటే భయంగా ఉంది. వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో అయోమయంగా ఉంది. రోడ్లపై పార్కింగ్ చేస్తే పోలీసులు ఫొటో తీసి చలాన్లు రాస్తున్నారు.

– దూడపాక మల్లేశ్, వాహనదారు

**అవగాహన ఉండాలి**



అందరికీ ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి. రోడ్లపై కాకుండా మధ్యలోనే వాహనాలు పార్కింగ్ చేయాలి. రోడ్లకు ఇరువైపులా కనీసం 20 మీటర్ల వరకు విస్తరణ జరగాలి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అప్పటిదాకా ట్రాఫిక్‌కు అవాంతరం కలుగకుండా అందరూ సహకరించాలి.

– ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ

**మాస్టర్ ప్లాన్ అమలు చేయాలి**



నగరపాలక సంస్థ అధికారులు మాస్టర్ ప్లాన్ అమలు చేయకపోవడంతోనే ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. వ్యాపార సంస్థల్లోని ఇరుకు రోడ్లను విస్తరించడంలేదు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని సెల్లార్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు.

– ఖాజాజమీరొద్దీన్, సామాజిక కార్యకర్త

- రూ.608 లక్షలు వెచ్చించి 2013లో నిర్మించిన ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని సెల్లార్‌ను పార్కింగ్ కోసం వినియోగించేందుకు నాలుగేళ్ల క్రితం పాలకులు, అధికారులు చేసిన ప్రత్నాలు విఫలమయ్యాయి.
- ఏళ్లు గడుస్తున్నా జటిలమైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించకుండా పాలకులు, బల్దియా, పోలీసు అధికారులు చేతులెత్తేశారు.

# కాంగ్రెస్‌కు ఓటువేస్తే ఆగమవుతాం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్


గోదావరిఖని: మాట్లాడుతున్న కోరుకంటి చందర్


ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు

**గోదావరిఖని:** కాంగ్రెస్ నమ్మి ఓటువేస్తే మోసపోతామని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. మంగళవారం జీడీకే–1వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో సింగరేణి కార్మికులు ఎన్నో హక్కులు కోల్పోయారన్నారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీతో సీఎం కేసీఆర్ వారసత్వపు హక్కును పునరుద్ధరించారన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కార్మికులు బీర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, కార్పొరేటర్ పులేందర్, నాయకులు దామోదర్‌రావు, కొమురయ్య పాల్గొన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

రామగుండంలో రాజ్‌ఠాగూర్ చిచ్చు పెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విమర్శించారు. తిలక్‌నగర్ డౌన్‌లోని విశ్వం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండుసార్లు ఓడిపోయానంటూ కాంగ్రెస్ అభ్యర్థి కల్లబొల్లి మాటలను ప్రజలను నమ్మొద్దన్నారు. ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు, నాయకులు కౌశిక హరి, పీటీస్వామి తదితరులు పాల్గొన్నారు.

**గోదావరిఖని:** రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. తిలక్‌నగర్ నుంచి భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలోనే ఈప్రాంతం వెనుకబడిపోయిందన్నారు.

**గులాబీకే పట్టం**

**జ్యోతినగర్:** నియోజకవర్గంలోని ఓటర్లు కారుగుర్తుకు ఓటు వేసి కోరుకంటి చందర్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు అన్నారు. మంగళవారం ప్రచారం ముగింపు సందర్భంగా నాలుగో డివిజన్ కృష్ణానగర్‌లో భారీ ర్యాలీ చేపట్టారు.

**బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు**

**రామగుండం:** హైదరాబాద్‌లోని నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు దళిత జాతికి గౌరవం దక్కిందని, సంక్షేమ పథకాల అమలు బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కనుకుంట్ల సమ్మయ్యమాదిగ అన్నారు. అంతర్గాం ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

**కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతాం**

కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతామని బీఆర్ఎస్ పార్టీ అంతర్గాం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ కోరారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ప్రతీ గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. అంతర్గాంలో లిఫ్ట్ పూర్తి, నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు, నిరుపయోగంగా ఉన్న 1018 ఎకరాల కుర్జుకమ్మి భూములకు అసైన్డ్ పట్టాల మంజూరు చేసి భూమిపై క్రయవిక్రయాలకు హక్కులు కల్పించిన ఘనత ఎమ్మెల్యే చందర్‌కు దక్కిందన్నారు.

# కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి

- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి


రోడ్‌షోలో మాట్లాడుతున్న దాసరి మనోహర్‌రెడ్డి

**పెద్దపల్లిరూరల్:** పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్నింగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు సీఎం కేసీఆర్ ప్రజలందరికీ సంక్షేమపథకాల ఫలాలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిపారని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. మళ్లీ సీఎంగా కేసీఆర్‌కే అవకాశమిచ్చి మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశమివ్వాలని, పెద్దపల్లిని జిల్లాకేంద్రంగా ఏర్పాటు చేసుకొని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలన్నారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇన్‌చార్జి రవీందర్‌సింగ్, ఎంపీపీ స్రవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, ఉప్పు రాజ్‌కుమార్ తదితరులున్నారు.

**బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు**

**ఎలిగేడు:** గత పదేళ్లలో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించిందని కారుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎలిగేడు మండలం శివుపల్లిలో దాసరి మనోహర్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు శివుపల్లికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గ్రామానికి ఏం చేయని విజయరమణారావు, గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ కావాలో ప్రజలే నిర్ణయించి ఓటు వేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో బీఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ఆలోచించాలన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తూడి తిరుపతి, ఎంపీటీసీ తూడి లక్ష్మీ మురళి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సుధాకర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


రోడ్ షోకు హాజరైన ప్రజలు

# ఆశీర్వదిస్తే.. సేవకుడిగా పనిచేస్తా


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు


రోడ్‌షోలో పాల్గొన్న పుట్టమధు

- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు

**మంథని:** కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేళ్లు గోసపడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. లక్కేపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 24గంటల కరెంటుకావాలో మూడు గంటల కరెంటు కావాలో రైతులు ఆలోచించాలన్నారు.

**పుట్ట మధుకు ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు**

లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) డిమాండ్లను పరిష్కరించినందుకు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ తెలిపారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గిరిజనులు పుట్టమధును ఆశీర్వదించాలని ఆయన కోరారు.

**ఓటమి భయంతోనే..**

ఓటమి భయంతోనే కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతుందని మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మంథని మండలం లక్కేపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మంథనిలో కాంగ్రెస్ పార్టీ ఓటమిని అంగీకరించినట్లేనని భావించవచ్చన్నారు. ఇక్కడి నాయకులకు ప్రజల అవసరం లేదు కానీ వాళ్ల ఓట్లు మాత్రమే కావాలని ఆయన దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మడం లేదన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ:** బీఆర్ఎస్ మూడోసారి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఈద శంకర్ రెడ్డి అన్నారు. రామగిరి మండలం సుందిళ్లలో కమాన్ పూర్ మార్కెట్ చైర్మన్ దాసరి రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు.

**మల్హర్ :** తనను ఆశీర్వదించి మంథని ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. చివరిరోజు మండలకేంద్రం తాడిచర్లలో ప్రచారం నిర్వహించారు. శ్రీధర్‌బాబుని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏ ఆడబిడ్డ వివాహానికి సాయం చేశారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

**ప్రతిఒక్కరికీ అండగా ఉంటా**

**కాటారం :** మండలకేంద్రంలో భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్‌తో కలిసి పుట్ట మధు రోడ్ షో నిర్వహించారు. అంతకముందు బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ తీశారు. ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మధు మాట్లాడారు.

**కేసీఆర్‌తోనే కార్మికుల సంక్షేమం**

**రామగిరి:** గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కార్మికులు, భూ నిర్వాసితుల పక్షాన పోరాడానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో ప్రచారం చేశారు.

# అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి


మాట్లాడుతున్న శ్రీధర్ బాబు

- మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు

**యైటింక్లయిన్‌కాలనీ :** గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నానని మరోసారి ఆశ్వీరదించాలని మంథని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీధర్ బాబు అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను దోచుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే వెంకట్రావుపల్లి గ్రామాన్ని సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి సురక్షిత ప్రాంతానికి తరలించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మారెల్లి రాజిరెడ్డి, చాట్లా సదానందం, విజేందర్ రెడ్డి, తిరుపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ విజయభేరి సభ సక్సెస్**

**మంథని:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజు మంథనిలో విజయభేరి పేరుతో కాంగ్రెస్ నిర్వహించిన సభ విజయవంతమైంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో మంథని వీధులు కిక్కిరిసిపోయాయి. ఆర్టీసి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో జనం తరలివచ్చారు. సూరయ్యపల్లి క్రాస్‌రోడ్ నుంచి అటు గోదావరిఖని పాత రోడ్డు...పెద్దపల్లి నాలుగువైపులా వాహనాలు, ఎక్కడ చూసినా జనమే కనిపించారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభకు మంథనికి మాజీ ఎంపీ విజయశాంతి వచ్చారు. 2018లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మంథని ఎమ్మెల్యేగా శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరే గెలుపొందారు. ఈ సారి సైతం అదే సెంటిమెంట్‌తో విజయశాంతిని రప్పించినట్లుగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.


విజయశాంతికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు, పార్టీ శ్రేణులు

# కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ రావాలి


రోడ్‌షోలో మాట్లాడుతున్న శ్రీధర్ బాబు


హాజరైన ప్రజలు

- పెద్దపల్లి రోడ్‌షోలో మాజీమంత్రి శ్రీధర్‌బాబు

**పెద్దపల్లిరూరల్:** పదేండ్ల పాలనలో పడిన కష్టాలు పోగొట్టుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వమే రావాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారని మాజీమంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావుకు మద్దతుగా మంగళవారం రోడ్ షో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బిరుదురాజమల్లుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డికి రెండుసార్లు అవకాశమిస్తే రైతుల శ్రమను ధాన్యం కటింగ్‌పేరిట దోచుకున్నారన్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో పెద్దపల్లికి బైపాస్ రోడ్డు మంజూరైనా పనులు చేయలేదన్నారు. బస్‌డిపో ఏర్పాటుకు శ్రద్ధ చూపలేదన్నారు.

**ఓడినా.. గెలిచినా ప్రజల మధ్యే**

ఎన్నికల్లో తాను గెలిచినా, ఓడినా ప్రజల మధ్యే ఉండి రైతులు, ప్రజల, వ్యాపారుల సమస్యలపై పోరాటం చేశానని కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారంలో ఉండి అక్రమంగా సంపాదించిన కోట్ల కొద్ది డబ్బు సంచులతో ఓట్లు కొనేందుకు వస్తున్నాడని, ఆయన చేతిలో మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సైతం పోలింగ్ జరిగే దాక అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు ధర్మయ్య, రాజయ్య, శ్రీనివాస్, తదితరులున్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్

**గోదావరిఖని:** కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పార్టీ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన సభలో తీన్మార్ మల్లన్న, సినీనటుడు శివారెడ్డితో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాదరణ కోల్పోతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో పాటు అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు.

**వ్యాపారస్తులను కలిసిన రాజ్‌ఠాగూర్**

లక్ష్మీనగర్ ఏరియాలో వ్యాపారస్తులను రాజ్‌ఠాగూర్ కలిశారు రానున్న. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**కాంగ్రెస్‌లోకి ముదిరాజ్‌లు**

ముర్మూర్ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పెసరి సురేశ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు పార్టీలో చేరగా పార్టీలోకి ఆహ్వానించారు.

**రామగుండం:** అవకాశవాద రాజకీయ నాయకులను ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్ అన్నారు. అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు.


మాట్లాడుతున్న మక్కాన్ సింగ్

**కాంగ్రెస్‌లో చేరిక**

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన బీజేపీ ప్రతినిధి షరీఫ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

**రామగుండం:** కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్‌ఠాకూర్ గెలవాలని కోరుతూ అంతర్గాం మండల పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన పలువురు అభిమానులు అరుణాచల గిరి ప్రదర్శన చేశారు. దేవాలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. ఇందులో తోకల కుమార్ (రాయదండి), గోనె ప్రకాష్ (పెద్దంపేట), ఈదునూరి అజయ్ (రామగుండం) తదితరులున్నారు.

# కేసీఆర్‌ను దించండి.. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వండి

- మాజీ ఎంపీ విజయశాంతి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ విజయశాంతి

**మంథని:** తెలంగాణలో ప్రజలు సంబురంగా ఉన్నారని సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నారని, మహిళలపై మానభంగాలు, హత్యలు, హింసలు జరుగుతున్నాయని, ఇదేనా ప్రశాంతత అని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ శివారులో మంగళవారం ఏర్పాటు చేసిన విజయభేరి సభలో ఆమె మాట్లాడారు. పదేళ్లలో అన్నివర్గాలలకు అన్యాయం చేసిన కేసీఆర్‌ను గద్దె దించి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి రాష్ట్రాన్ని బహుమతిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికి ఇక్కడకు వచ్చానని, అప్పుడు ఆదరించినట్లే ఈసారి కూడా శ్రీధర్ బాబును గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యలు, నాడి తెలిసిన శ్రీధర్‌బాబు అద్భుతమైన కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించారని ప్రశంసించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక లారీ ఘటన, మంథనిలో లాయర్ వామన్‌రావు దంపతులను నడిరోడ్డుపై నరికించి, రైతులకు సంకెళ్లు వేయించిన హింసాత్మక సంఘటనలు తెలంగాణలోనే చోటుచేసకుంటున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో పంటలు, గ్రామాలు మునిగిపోయాయని, మేడిగడ్డ కుంగిందని, ఇందులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాములమ్మ ఆరోపించారు. నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలన్నారు. మార్పు కావాలి, కాంగ్రెస్ రావాలని అన్నారు. ప్రకృతి కూడా కేసీఆర్‌కు సహకరించడం లేదని పేర్కొన్నారు. కేసీఆర్‌కు పతనం మొదలైందని జోస్యం చెప్పారు.

**ఆ రెండు పార్టీల తెరవెనుక ఒప్పందాలు**

ప్రధాని నోట నిజాలు వస్తాయని అందరూ అనుకుంటే ఆయన సైతం అబద్ధాలు వల్లిస్తున్నారని రాములమ్మ విమర్శించారు. కేసీఆర్ కుటుంబం అవినీతి పాలన చేస్తుందని, ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోంశాఖమంత్రి అమితాషా అంటూనే ఆ కుటుంబంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య తెరవెనుక ఒప్పందాలు ఉన్నాయని ఆమె ఆరోపించారు.

**అందరూ చదువుకునేలా ఆనాడే చేశాం..**


మంథనికి ఏం చేశారని ప్రశ్నించే వారికి సమాధానాలు అనేక ఉన్నాయని విజయశాంతి అన్నారు. విద్య, వైద్య రంగాలను కాంగ్రెస్ హయాంలోనే మంథని దరి చేర్చామని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంథనిలో మెడికల్, వ్యవసాయ డిగ్రీ, నర్సింగ్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 2009లోనే 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని గుర్తుచేశారు. మంథని ప్రాంతంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే చంపుతామంటూ దాడులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రౌడీయిజం, గూండాయిజం చేస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ముంపునకు గురవుతున్న వారికి పంట పరిహారం చెల్లింపులతోపాటు ముంపు లేకుండా కరకట్టలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. మంథనిలో సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలతో వంద పడకల ఆస్పత్రితోపాటు మండల కేంద్రాల్లో 30 పడకల ఆస్పత్రులు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతీ మండలంలో ఇంటర్ నేషనల్ స్కూల్ స్థాపిస్తామని అన్నారు. ఓబీసీ సెల్ జాతీయ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినయ్‌కుమార్, పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేశ్‌కుమార్, పబ్లిసిటీ కమిటీ సభ్యుడు సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఎన్నికల కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు జైలు

**కోనరావుపేట(వేములవాడ):** ఆటోను నిర్లక్ష్యంగా నడిపి, బావిలో పడగొట్టి, ఓ వ్యక్తి మృతికి కారణమైన ఆటోడ్రైవర్‌కు ఏడాదిన్నర జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2015 సెప్టెంబర్ 2న సిరిసిల్ల నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో కోనరావుపేట మండలం మర్తనపేట శివారులోని కలకోట దేవయ్య ఇంటి పక్కనున్న పాడుబడ్డ బావిలో పడింది. ఈ ప్రమాదంలో మర్తనపేట, ధర్మారం, మల్కపేట గ్రామాలకు చెందిన పలువురు ప్రయాణికులు గాయపడగా ధర్మారం వాసి పిట్టల రామస్వామి మృతి చెందాడు. అప్పటి సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మాలకొండ రాయుడు కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ఆటోడ్రైవర్ తీపిరి మహేందర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి, ప్రమాదానికి కారణమైనట్లు రుజువైంది. దీంతో అతనికి జైలుశిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎవరైనా వాహనాలను అజాగ్రత్తగా నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ఆంజనేయులు హెచ్చరించారు.

## చనిపోయిన వ్యక్తికి ఓటుహక్కు




శ్రీధర్(ఫైల్)

**గోదావరిఖనిటౌన్:** సుమారు తొమ్మిదేళ్లక్రితం మరణించిన వ్యక్తికీ ఎన్నికల కమిషన్ ఓటుహక్కుకల్పించింది. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నగరంలోని మార్కండేయకాలనీలో మీసేవా కేంద్రం నిర్వాహకుడు దొమ్మటి శ్రీధర్ దాదాపు తొమ్మిదేళ్ల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఓటరు జాబితాలో ప్రస్తుతం అతడి పేరు ప్రత్యక్షమైంది. ఓటుహక్కు కలిగిఉన్న వారి పేర్లు జాబితాలో గల్లంతు కాగా.. మరణించిన వ్యక్తికి ఓటు హక్కు రావడంపై కాలనీవాసులు ముక్కున వేలేసుకుంటున్నారు.

## మోసపూరిత మాటలు నమ్మొద్దు

- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష


రోడ్‌షోలో మాట్లాడుతున్న దాసరి ఉష

**సుల్తానాబాద్:** అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. ఇద్దరు నాయకులు ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారన్నారు. వారి మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అధికారం లేక ముందే ఎన్నో కార్యక్రమాలు చేపట్టానన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పటేల్, మాజీ జెడ్పీటీసీ ఈర్ల కొమురయ్య, మండల అధ్యక్షుడు రంజిత్, మండల కోశాధికారి అల్లపు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు తోట మధు, నాయకులు, పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

**గోదావరిఖని:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విఠల్‌నగర లోని ఉంటున్న కొటం సంపత్ (56) అనే సింగరేణి కార్మికుడు విధులకు వెళ్తుండగా జీడీకే–2ఏ మోరీ సమీపంలోని రోడ్డుపై లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంపత్ మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## మంథనిని జిల్లా కేంద్రంగా చేస్తా

- మంథని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌రెడ్డి


ప్రచారంలో పాల్గొన్న సునీల్‌రెడ్డి

**మంథని:** మంథని ఎమ్మెల్యేగా గెలిపిస్తే డివిజన్ కేంద్రంగా ఉన్న మంథనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మంథనిలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అవినీతి, అసమర్థపాలన పోవాలంటే మార్పు అవసరమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. బీజేపీని ఆదరిస్తే పేదల కష్టాలు దూరమవుతాయన్నారు. సునీల్ అన్నారు.

**రామగిరి:** మంథని ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని నియోజకవర్గ అభివృద్ధి కృషిచేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. రాజాపూర్‌లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని, ప్రజలు కమలం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముల్కూరి శ్రీనివాస్, తీగల శ్రీధర్, తోట్ల రాజు, రాము, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.